సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



ఒక్కటి చేస్తున్నారు..

కుటుంబ కలహాలతో విడిపోదామనుకుం టున్న దంపతులను ఒక్కటి చేస్తున్నారు. - 8లో



రూ.68 లక్షల అవినీతి

రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలోని ఆర్‌పీలు చేసిన అక్రమాల్లో రూ.68 లక్షల మేర అవినీతి జరిగినట్లు టీఎంసీ ఎస్‌.వి.రత్నం శనివారం వెల్లడించారు. - 8లో



నేటినుంచి అండర్‌-19 క్రికెట్‌ టోర్నీ

నగరంలో జీసీసీఐ ఆధ్వర్యంలో అండర్‌-19 మహిళల వన్డే క్రికెట్‌ టోర్నమెంట్‌ పోటీలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. - 8లో

న్యూస్‌రీల్‌

మన్యం జిల్లా ఏఆర్‌ డీఎస్పీగా శేషాద్రి



పార్వతీపురం టౌన్‌: పార్వతీపురం మన్యం జిల్లా ఏఆర్‌ డీఎస్పీగా శేషాద్రి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఏఆర్‌ డీఎస్పీగా విధులు నిర్వహించిన బలివాడ నాగేశ్వరరావు విజయవాడ హెడ్‌క్వార్టర్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో శేషాద్రి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ విక్రాంత్‌ పాటిల్‌, అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌ కిరణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

బోగస్‌ కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ



విచారణ చేస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: బోగస్‌ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి శనివారం ఐటీడీఏలో విచారణ చేశారు. ఈ మేరకు డీఎల్‌ఎస్‌సీ సమావేశం నిర్వహించి దీనిలో నాలుగ కేసులపై విచారణ చేశారు. ఫిర్యాదుదారులతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇరువర్గాల వాదనలు విన్నారు. తదుపరి విచారణకు మరిన్ని ఆధారాలు తీసుకురావాలని సూచించారు. సీఐడీ డీఎస్పీ భూపాల్‌, ఏపీఓ రోసిరెడ్డి, డీడీ మంగవేణి, సూపరెంటెండెంటు దేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి నిత్యన్నదానానికి రూ.2లక్షల విరాళం



దాతల నుంచి రూ.2లక్షల విరాళం అందుకుంటున్న ఆలయ ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్‌: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీపైడితల్లి అమ్మవారి నిత్యన్నదానానికి రూ.2 లక్షలు విరాళాన్ని ధర్మపురికి చెందిన అనిల్‌కుమార్‌, లక్ష్మీ సుకన్యలు అందజేసినట్లు ఆలయ ఈఓ సుధారాణి శనివారం తెలిపారు. మానుకొండ వెంకటనారాయణ, కాళీబాబుల జ్ఞాపకార్థం అమ్మవారి నిత్యాన్నదానానికి విరాళాన్ని సద్వినియోగం చేయాలని కోరారన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదని, మరింతగా సహకరించాలని కోరారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఫోర్టిఫైడ్‌ బియ్యం

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఫోర్టిఫైడ్‌ బియ్యాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోంది. వీటి వినియోగం.. ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకువెళ్తోంది. వారిలో ఉన్న అపోహలను తొలగిస్తోంది.



అంగన్వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న సంపూర్ణపోషణ కిట్లు

- సంతులిత పోషకాల సమాహారంగా ఫోర్టిఫైడ్‌ రైస్‌
- గర్భిణులకు, బాలింతలకు ప్రయోజనం
- పోషకాహార లోపాల నివారణకు ప్రభుత్వం చర్యలు



అంగన్వాడీ కేంద్రాలలో ఆహారం గురించి తెలుసుకుంటున్న కలెక్టర్‌ నిషాంత్‌కుమార్‌ (ఫైల్‌)

పార్వతీపురం టౌన్‌: ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్కరూ అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపాలన్న లక్ష్యంతో నాణ్యమైన ఫోర్టిఫైడ్‌ బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. నాణ్యతలో తేడా లేకుండా చర్యలు చేపట్టింది. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. మాతాశిశు మరణాల నియంత్రణ, పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించింది. ఫోర్టిఫైడ్‌ బియ్యంతో సమస్యకు చెక్‌ పెడుతోంది. ఈ బియ్యం అందుబాటులోకి వచ్చి నెలలు గడిచినా ఇప్పటికీ వినియోగంపై అపోహలు ఉన్నాయి. వాటిని తొలగించేందుకు అంగన్వాడీ సిబ్బంది తమ వంతు కృషి చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్‌ రైస్‌ అంటే..

ఫోర్టిఫైడ్‌ రైస్‌ను వాడుక భాషలో బలవర్ధక బియ్యంగా పిలుస్తారు. సాధారణ బియ్యానికి దీనికి అనేక అంశాల్లో సారూప్యత ఉంది. బలవర్ధక బియ్యంలో పోషకాలు మెండు. పోషకాలను ప్రత్యేక గింజలు తయారు చేసి సాధారణ బియ్యంలో కలుపుతారు. వీటిని జత చేసి పంపిణీ చేస్తారు. ఈ కృత్రిమ బియ్యాన్ని కెర్నల్స్‌ అంటారు. ఫుడ్‌ సేఫ్టీ అండ్‌ స్టాండర్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా(ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎస్‌ఐ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి వంద కిలోల బియ్యానికి వ్యక్తి ఆరోగ్యస్థితి అవసరాన్ని బట్టి (సరఫరా అయ్యేది బాలింతలకా, గర్భిణులకా లేదా సాధారణ వ్యక్తులకా అనే అంశం పరిగణనలోకి తీసుకుంటారు.) ఒక కిలో లేదా రెండు కిలోల కెర్నల్స్‌ను కలుపుతారు.

ప్లాస్టిక్‌ బియ్యం కాదు..

ఫోర్టిఫైడ్‌ రైస్‌ ప్రాధాన్యతను గుర్తించక పలువురు గర్భిణులు, బాలింతలు ప్లాస్టిక్‌ రైస్‌ అంటూ తప్పుడు ప్రచారాలను నమ్ముతున్నారు. సాధారణంగా సంతులిత పోషకాలతో నిండిన కృత్రిమ బియ్యానికి ప్రత్యేక గుణముంది. తయారీ ప్రక్రియలో పోషకాల చేరికలోని హెచ్చుతగ్గుల కారణంగా వాటిలో కొన్ని నీటిలో తేలే గుణాన్ని కలిగి ఉంటాయి. అలా తేలిన బియ్యాన్ని ప్లాస్టిక్‌ బియ్యంగా భ్రమపడుతున్నారు. ఇవి ప్లాస్టిక్‌ బియ్యం కాదంటూ భద్రంగా వినియోగించుకోవచ్చంటూ నిపుణులు చెబుతున్నారు.

వంట విధానం..

బలవర్ధక బియ్యంలో జత చేర్చిన పోషకాలను కోల్పోకుండా ఉండాలంటే ప్రత్యేక వంట విధానాన్ని అవలంభించాలని కాకినాడ సీడీపీఓ వెల్లడించారు. ఫోర్టిఫైడ్‌ రైస్‌ కడిగేటప్పుడు అతిగా రుద్దకూడదు. వండే ముందు కొంతసేపు నీటిలో ఉంచి ఆ నీటిని ఒంపేయాలి. మరో మారు నీరు వేసి కడగాలి. తద్వారా పోషకాలు కోల్పోవు. అన్నం వండేటప్పుడు నెయ్యి, దాల్చిన చెక్క జీలకర్ర, యాలికలు, లవంగాలు వంటి దినుసులు జోడిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. ఫోర్టిఫైడ్‌ రైస్‌లో పోషకాలు మరింత ద్విగుణీకృతం చేసేందుకు సగం నీరు, సగం పాలు కలిపిన ద్రవంలో ఉడికిస్తే మేలు. ఫోర్టిఫైడ్‌ బియ్యాన్ని ఎప్పుడూ మూత పెట్టి ఉడికించాలి. తెరిచిన పాత్రలో వండితే పోషకాలు ఆవిరి రూపంలో కోల్పోవాల్సి ఉంటుంది. అల్యూమినియం కుక్కర్లకు బదులుగా స్టీలు, గాజు, మట్టి పాత్రల్లో వండటం పోషకాల నిలుపుదలకు దోహదపడతాయి.

జిల్లాలో అంగన్వాడీల వివరాలు...

ఐసీడీఎస్‌ ప్రాజెక్టుల వివరాలు	16
అంగన్వాడీ కేంద్రాలు	1425
మినీ అంగన్వాడీ కేంద్రాలు	639
గర్భిణులు	6088
బాలింతలు	7127
6 నెలలలోపు చిన్నారులు	31879
7నెలల నుంచి మూడేళ్ల పిల్లలు	25674

ఫోర్టిఫైడ్‌ బియ్యం శక్తివంతం



బాలింతలు, గర్భిణులకు అందించే ఫోర్టిఫైడ్‌ బియ్యం చాలా శక్తివంతమైనవి. అంగన్వాడీలతో పాటు బాలింతలు, గర్భిణులకు కూడా అందిస్తున్నాం. మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్‌ బియ్యంతో ఆహారం చాలా రుచికరంగా ఉంటోంది. మహిళల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ చిక్కీలు మొదలుకొని నూనె, రాగిజావ, కోడిగుడ్లు, బియ్యం అందిస్తున్నాం.

– రాణి, ఐసీడీఎస్‌ పీడీ, పార్వతీపురం మన్యం

ఇంటర్మీడియెట్‌ మార్కుల జాబితాలు సిద్ధం

విజయనగరం అర్బన్‌: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని జూనియర్‌ కళాశాలలో చదివి పరీక్ష రాసి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్‌ మార్కుల జాబితాలు స్థానిక ఇంటర్‌ బోర్డ్‌ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ శనివారం తెలిపారు. విద్యార్థుల మార్కుల జాబితాలను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకెళ్లి విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఆదివారం నుంచి మార్కుల జాబితాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. విద్యార్థులకు మార్కుల జాబితాలను అందజేయని పక్షంలో ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

ప్రజల చెంతకే వైద్య సేవలు

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజల చెంతకే వైద్య సేవలు అందిస్తున్న ఘనత దేశంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదవాడికి రోగం శాపం కాకూడదని ముఖ్యమంత్రి యొక్క గొప్ప ఆలోచనకు కార్యరూపమే జగనన్న ఆరోగ్య సురక్ష అని అన్నారు. నవంబరు 10 వరకు ఈ వైద్య శిబిరాలు జిల్లాలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో 84 మంది స్పెషలిస్టు వైద్యులు, 23 మంది స్త్రీ వైద్య నిపుణులు, 19 మంది వైద్య నిపుణులు తమ వంతు సేవలు అందిస్తున్నారన్నారు. రోగులను పరీక్షించడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. రోగులు కార్పొరేట్‌కు మించి వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణుల సామూహిక సీమంతాల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌ చైర్‌పర్సన్‌ జర్నాపు దీప్తి, వైస్‌ చైర్మన్‌ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్‌, కమిషనర్‌ జయరాం, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో సత్ఫలితాలు

- వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి
- జెడ్పీ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రతి కుటుంబం యొక్క ఆరోగ్య రక్షణ తన బాధ్యతగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తలపెట్టిందని జిల్లా పరిషత్తు చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజల చెంతకే వెళ్లి వైద్య పరీక్షలు, మందులు నుంచి శస్త్రచికిత్సల వరకూ పూర్తి ఉచితంగా అందించే ఇలాంటి కార్యక్రమం దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేదన్నారు. ముఖ్యమంత్రి ఆశయ సాధనకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉన్నతాధికారులు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, వైద్యులు, వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేస్తున్నారని అన్నారు. విజయనగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

అభివృద్ధి, సంక్షేమంలో మిన్న...

''రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా పేదలకు నాణ్యమైన వైద్యం, వారి పిల్లలకు విద్య అందించాలనేది వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. సెప్టెంబరు 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తలపెట్టారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు ప్రభుత్వం 158 మంది స్పెషలిస్టు డాక్టర్లను ప్రభుత్వం కేటాయించింది. ప్రతి శిబిరం వద్ద 105 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. ఇవిగాక రోగి అవసరాన్ని బట్టి మరే ఇతర మందులైనా వైద్యులు సిఫారసు చేస్తే డ్రగ్‌ స్టోర్‌ నుంచి ప్రత్యేకంగా తెప్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈసీజీ సహా 17 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఎవరికైనా ప్రత్యేక వైద్యం లేదా శస్త్రచికిత్స అవసరమని వైద్యులు రిఫర్‌ చేస్తే వారికి ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా చేయించేందుకు ఆయా ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోంది.'

సురక్ష శిబిరాలు విజయవంతం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారుల సమష్టి కృషితో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతంగా జరుగుతున్నాయి. శనివారం నాటికి విజయనగరం జిల్లాలో 150, పార్వతీపురం మన్యం జిల్లాలో 84 వైద్య శిబిరాలు నిర్వహించారు. వీటికి అనూహ్య స్పందన లభిస్తోంది. వీటిపై ప్రజల్లో విశ్వాసం ఏర్పడింది.

టీడీపీ ఆపసోపాలు

గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ నాయకులు ఆపసోపాలు పడుతున్నారు. చేసిన తప్పుకు శిక్ష అనుభవిస్తూ చంద్రబాబు బెయిల్‌ రాక ఇబ్బంది పడుతూ ఉంటే వైఎస్సార్‌సీపీపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యవస్థలను మ్యానేజ్‌ చేసి చంద్రబాబును జైల్లో పెట్టారని చెబుతున్న లోకేష్‌ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. వ్యవస్థల మేనేజ్‌మెంట్‌ అంటే ఈ దేశంలో గుర్తొచ్చే ఏకైక వ్యక్తి చంద్రబాబే. తమ నిర్దోషిత్వాన్ని కోర్టుల్లో నిరూపించుకొని బయటకు రావాలే తప్ప వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు సరికాదు. దుష్ప్రచారంతో ప్రజల దృష్టిని మరల్చలేరు.''

9న పార్టీ ప్రతినిధుల సమావేశం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దిశానిర్దేశం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సమావేశాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. విజయనగరం జిల్లా నుంచి హాజరు కావాలని సుమారు 300 మందికి ఆహ్వానాలు పంపారు. వారికి గుర్తింపు కార్డులను జారీ చేశారు. వారి ప్రయాణ, వసతి ఏర్పాట్లు అన్నీ చేస్తున్నాం. ఆహ్వానాలు అందని మిగతా నాయకులు నిరుత్సాహ పడవద్దు. త్వరలోనే వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లావారీ సమావేశాలు నిర్వహించనున్నారు.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్‌

ఔత్సాహిక రైతులకు ప్రోత్సాహక రాయితీలు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నాగేశ్వరరావు

పార్వతీపురం టౌన్‌: జిల్లాలో ఔత్సాహిక రైతులకు ప్రోత్సాహక రాయితీని జాతీయ లైవ్‌ స్టాక్‌ మిషన్‌ అందిస్తుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వాకాడ నాగేశ్వరరావు అన్నారు. పార్వతీపురంలోని సీ – కన్వెన్షన్‌ ఫంక్షన్‌ హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతి కోసం జాతీయ లైవ్‌ స్టాక్‌ మిషన్‌ నిధులతో 2021 – 22 నుండి 2025 – 26 సంవత్సరాల కాలపరిమితిలో ఔత్సాహిక వ్యాపార వర్తకాలను ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. గొర్రెలు, మేకల, కోళ్ల, పందుల పెంపకం, పశుగ్రాసం, దాణా తయారీలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అసంఘటితంగా ఉన్న పశు సంవర్ధక రంగాన్ని వ్యవస్థీకృత రంగంలోకి తీసుకువచ్చి పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులను పెంచి, మార్కెటింగ్‌ సౌకర్యాలు, గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా గ్రామీణాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. వ్యాపార వేత్తలను ప్రోత్సహించడం, గుర్తింపు పొందిన స్వజాతి పశు జాతుల సంరక్షణ, పశు మేత, పశు దాణా ఉత్పత్తిని ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. గొర్రెలు, మేకల ఫారం పెట్టాలనుకునే వారికి కేంద్ర ప్రభుత్వం నేషనల్‌ లైవ్‌ స్టాక్‌ మిషన్‌ పథకం ద్వారా సబ్సిడీ అందిస్తుందని, ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం సబ్సిడీ (రూ.10 లక్షల నుండి 50 లక్షల వరకు) అందిస్తుందని, లబ్ధిదారుని వాటా మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం, బ్యాంక్‌ రుణం 40 శాతం ఉంటుందన్నారు. ఈ పథకం మార్చి 2026 వరకు అమలులో ఉంటుందన్నారు. హెచ్‌టీటీపీఎస్‌://నిమ్‌.ఉద్యమిమిత్ర.ఇన్‌ వెబ్‌ సైట్‌ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి అధ్యక్షుడు బెల్లాన బంగారు నాయుడు, జిల్లా పశుసంవర్ధక అధికారి జె.రత్నాకర్‌, జిల్లా లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ జె.ఎల్‌.ఎస్‌.మూర్తి, జిల్లాలో వున్న పశువైద్య అధికారులు, మండల అధికారులు, జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సభ్యులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ టెన్నీకాయిట్‌ పోటీల్లో మౌనిక ప్రతిభ

విజయనగరం: అంతర్జాతీయ స్థాయిలో టెన్నీకాయిట్‌ పోటీల్లో విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన రెడ్డి మౌనిక అరుదైన ఘనత సాధించింది. గత నెల 30 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు సౌత్‌ ఆఫ్రికా వేదికగా జరిగిన పోటీల్లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెడ్డి మౌనిక కాంస్య పతకం దక్కించుకుంది.

రాష్ట్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ జట్టులోకి అర్హత సాధించగా... నగరంలోని కేఎల్‌పురం ప్రాంతానికి చెందిన మౌనిక ఐదోసారి జరిగిన అంతర్జాతీయ స్థాయి టెన్నీకాయిట్‌ పోటీలకు ఎంపికైన వారిలో ఒకరు కావటం విశేషం. జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచటంతో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించటం ద్వారా జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పిన మౌనికను జిల్లా టెన్నీకాయిట్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు, పలు క్రీడా సంఘాలు అభినందించాయి.

విద్యుత్‌ శాఖ ఈఈ కృష్ణమూర్తి బదిలీ

విజయనగరం ఫోర్ట్‌: విద్యుత్‌ శాఖ ఈఈగా పని చేస్తున్న నాగిరెడ్డి కృష్ణమూర్తికి పదోన్నతిపై బదిలీ అయింది. కృష్ణమూర్తికి శ్రీకాకుళం ఎస్‌ఈగా పదోన్నతి లభించింది. ఈయన స్థానంలో బొబ్బిలిలో డీఈగా పని చేస్తున్న పూడి హరి నియమితులయ్యారు. బొబ్బిలి డీఈగా విశాఖలో పని చేస్తున్న అనంతరావు నియమితులయ్యారు. ఎస్‌ఈగా పదోన్నతి పొందిన కృష్ణమూర్తిని వైఎస్సార్‌ విద్యుత్‌ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బికెవి.ప్రసాదరావు తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

అమ్మకం వాస్తవం కాదు..


జగనన్న లేఅవుట్ వద్ద విచారణ చేస్తున్న తహసీల్దారు శ్రీనివాసరావు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డు దగ్గరలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో 'ఇళ్లపట్టాల అమ్మకం' అన్న శీర్షికతో ఒక ప్రధాన పత్రికలో వచ్చిన వార్తా కథనంలో ఎలాంటి వాస్తవం లేదని తహసీల్దారు డి.శ్రీనివాసరావు శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ప్రచురితమైన 'ఇళ్లపట్టాల అమ్మకం' వార్తపై స్పందించిన ఆయన వీఆర్‌వోలతో కలిసి అక్కడికి వెళ్లి, లబ్ధిదారులతో మాట్లాడి, విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 147లో 29 ఎకరాల 60 సెంట్ల స్థలం సేకరించి, లేఅవుట్ వేసి, 1130 ప్లాట్లను తొలి విడత కింద అర్హులకు కేటాయించామన్నారు. ప్రస్తుతం 80 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. రెండో విడత ఇళ్లస్థలాల పంపిణీకి సిక్స్ స్టెప్ వేలిడేషన్ ద్వారా 481 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వారికోసం దాదాపు 11 ఎకరాల భూసేకరణకు ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 80 ప్లాట్లను కేటాయించేందుకు అర్హులను లాటరీ ద్వారా ఎంపిక చేసేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. విచారణలో ఎటువంటి అక్రమ అమ్మకాలు జరగలేదని, ఇళ్లస్థలాల మంజూరు మాత్రమే తమ పరిధిలో ఉందన్నారు. ఖాళీగా ఉన్న ప్లాట్లు ఇస్తాం.. మీకు ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ వార్తలో ప్రచురించిన అంశాల్లో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. అలా ఎవరైనా ప్రలోభపెడితే నమ్మి పోసవద్దన్నారు. అనధికారికంగా ప్లాట్లు కొనుగోలు చేసినా చెల్లుబాటు కాదన్నారు.

కారుణ్య నియామకపత్రం అందజేత


విజయలక్ష్మికి నియామకపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జామి మండలం, బలరాంపురం పాఠశాలలో ఎర్ని అప్పారావు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల మరణించడంతో ఆయన భార్య విజయలక్ష్మికి ఎల్.కోట మండల పరిషత్ కార్యాలయంలో సహాయకురాలిగా నియమిస్తూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కారుణ్య నియామకపత్రాన్ని శనివారం అందజేశారు. జెడ్పీ చైర్మన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, జామి జెడ్పీటీసీ సభ్యులు గొర్లె సరయు, తదితరులు పాల్గొన్నారు.

రూ.68 లక్షల అవినీతి


గ్రామంలో దర్యాప్తు నిర్వహిస్తున్న బృంద సభ్యులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలోని ఆర్‌పీలు చేసిన అక్రమాల్లో రూ.68 లక్షల మేర అవినీతి జరిగినట్టు టీఎంసీ ఎస్.వి.రత్నం శనివారం వెల్లడించారు. గంగోత్రి, రామసీత, సీతారామ ఎస్‌ఎల్‌ఎఫ్(స్లమ్ లెవల్ ఫెడరేషన్)ల పరిధిలో మొత్తం 78 సంఘాలున్నాయి. జిల్లా పీడీ సుధాకర్ ఆదేశాల మేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 36 మంది అధికారుల బృందం దర్యాప్తు నిర్వహించి, నివేదికను అందించిందన్నారు. గంగోత్రి ఎస్‌ఎల్‌ఎఫ్ నిర్వహిస్తున్న రామలక్ష్మి పరిధిలోని సంఘాల్లో ఎటువంటి అవకతవకలు జరగలేదని నిర్ధారించారు. రామసీత ఎస్‌ఎల్‌ఎఫ్‌లోని 27 సంఘాలకు ఆర్‌పీగా ఉన్న ఎస్.ఉమాదేవి రూ.33 లక్షలు, సీతారామ ఎస్‌ఎల్‌ఎఫ్‌లోని 25 సంఘాలకు ఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్న పి.సంధ్య రూ.35 లక్షల మేర స్వాహా చేసినట్లు గుర్తించామన్నారు. ఈ మొత్తం అంతా సీసీఎల్ (క్యాష్ ఆన్ క్రెడిట్ లోన్) రూపంలోను, రుణాల వాయిదా సొమ్ము సభ్యుల నుంచి తీసుకుని, బ్యాంకుకు కట్టకుండా వారి పొదుపులో నుంచి రుణాల ఖాతాకు జమచేయడం ద్వారా నగదు పక్కదారి పట్టించారని తెలిపారు. ఈ మొత్తాలను సభ్యులకు తెలియకుండా జాగ్రత్తపడుతూ లోను, పొదుపు పుస్తకాలతో పాటు తీర్మానాల పుస్తకాలు సైతం ఆర్‌పీల వద్దే ఉంచుకున్నారని వివరించారు. మొత్తం నివేదికలను సోమవారం జిల్లా పీడీ కార్యాలయానికి తీసుకువెళ్లనున్నామని, సంఘాల వారీగా ఎంత మొత్తంలో స్వాహా జరిగిందనేది అక్కడ తేలనుందన్నారు. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన రూ. 68 లక్షలతోపాటు గతంలో మరో ఆర్పీ రూ.18 లక్షలు అవకతవకలు ఒకే బ్యాంకులో జరగడంతో సభ్యులతోపాటు అధికారులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

ఒక్కటి చేస్తున్నారు..

- విడిపోయే వారిని ఒక్కటి చేస్తున్న కలెక్టరేట్ గృహహింస నివారణ విభాగం
- కుటుంబ కలహాలతో వచ్చిన వారికి కౌన్సిలింగ్ ద్వారా పరిష్కారం
- ఇప్పటివరకు వివిధ సమస్యలతో వచ్చిన వారు 898 మంది
- కౌన్సిలింగ్ ద్వారా 166 మంది.. కోర్టు ద్వారా మరో 90 మందిని కలిపారు..
- కేసు ఉపసంహరించుకున్న వారు 157 మంది


విడిపోవాలనుకుంటున్న దంపతులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సోషల్, లీగల్ కౌన్సిలర్లు(ఫైల్)

విజయనగరం ఫోర్ట్: కుటుంబ కలహాలతో విడిపోదామనుకుంటున్న దంపతులను ఒక్కటి చేస్తున్నారు గృహహింస నివారణ విభాగం సిబ్బంది. సమస్య ఏదైనా వారిని ఆశ్రయిస్తే చాలు పరిష్కారం దొరుకుతుందన్న భరోసాను బాధితులకు ఇస్తున్నారు. భార్యాభర్తలకు పలు దఫాలు కౌన్సిలింగ్ ఇచ్చి, వారి సమస్యపై వారికే అవగాహన కల్పిస్తున్నారు. వారి అపార్థాలను వారే తెలుసుకుని, ఒకరినొకరు చక్కగా అర్థం చేసుకుని, మంచిగా జీవించేలా వారికో కొత్త జీవితం ప్రసాదిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. తెర్లాం మండలానికి చెందిన ఓ మహిళకు అదే మండలానికి చెందిన వ్యక్తితో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరిద్దరూ తిరుపతిలో ఉండేవారు. ఆషాఢానికి ఆ మహిళను కన్నవారింటికి పంపించి, మళ్లీ తిరుపతి తీసుకువెళ్లలేదు. దీంతో ఆమె కలెక్టరేట్‌లోని గృహహింస విభాగాన్ని ఈ ఏడాది మే నెలలో ఆశ్రయించి, సమస్యను విన్నవించుకుంది. గృహహింస విభాగం కౌన్సిలర్లు భార్యాభర్తలిద్దరినీ పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చి, నచ్చజెప్పారు. ఆ దంపతులిద్దరినీ ఒక్కటి చేశారు. ఇదిలా ఉండగా, ఎస్.కోట మండలానికి చెందిన మహిళకు పూసపాటిరేగ మండలానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరి కాపురం కొన్నాళ్ల పాటు సజావుగానే జరిగింది. ఆ తర్వాత అతడు భార్యను కొట్టడం, తిట్టడం చేస్తూ హింసించేవాడు. దీంతో బాధిత మహిళ గృహహింస విభాగాన్ని ఆశ్రయించి, ఆమె పడుతున్న బాధను చెప్పుకుంది. అక్కడి కౌన్సిలర్లు వారిద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి, మళ్లీ వారు యథావిధిగా వారి జీవితం ప్రారంభించేలా చేశారు. ఇలా భర్తతో గానీ అత్తమామలతో గానీ వేధింపులకు గురైన వారు గానీ, గొడవల కారణంగా విడిపోయేందుకు సిద్ధమైన వారు గానీ కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గృహహింస విభాగంలో తమ సమస్య చెప్పుకుంటే చాలు అక్కడి సోషల్ కౌన్సిలర్, లీగల్ కౌన్సిలర్, ఇద్దరు హోంగార్డులు కలిసి వారి సమస్యకు చక్కని పరిష్కారం చూపుతూ వారు కలసిమెలసి జీవించేలా చేస్తున్నారు.

కౌన్సిలింగ్ ఇలా..

ఫిర్యాదు స్వీకరించిన వెంటనే బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులను కౌన్సిలింగ్‌కు పిలుస్తారు. ఒకసారి జరిగే కౌన్సిలింగ్‌లో రాజీపడని వారికి పలు దఫాలుగా కౌన్సిలింగ్ ఇస్తారు. సాధ్యమైనంత వరకు కౌన్సిలింగ్ ద్వారా భార్యాభర్తలను కలిపే ప్రయత్నం చేస్తారు. అయినప్పటికీ రాజీకి రాని వారి సమస్య పరిష్కారానికి ఉచితంగా కోర్టులో కేసు వేస్తారు. కోర్టుకు వెళ్లిన తర్వాత కొంతమంది, వెళ్లకు ముందే ఒకరినొకరు అర్థం చేసుకుని మరికొంతమంది కలిసిపోతున్నారు. ఆనందంగా జీవిస్తున్నారు.

2006లో గృహహింస విభాగం ఏర్పాటు..

జిల్లాలో 2006లో గృహహింస విభాగం ఏర్పాటైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు 898 మంది గృహహింస విభాగాన్ని ఆశ్రయించి, న్యాయం పొందారు. కౌన్సిలింగ్ ద్వారా 166 మంది, కోర్టు కేసుల ద్వారా 90 మంది, కోర్టు కేసు ఉపసంహరణ ద్వారా మరో 123 మంది కలిశారు. మొత్తం ఈ తరహా కేసులు 607 కోర్టులో ఉండగా, 342 కేసులు తుదితీర్పుకు వచ్చాయి. మరో 141 కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

భార్యాభర్తలను కలపడం సంతోషం..



కుటుంబ కలహాలతో తమ దగ్గరకు వస్తున్న భార్యాభర్తలను కలుపుతుండడం చాలా సంతోషాన్నిస్తోంది. ముందుగా వారికి కౌన్సిలింగ్ ఇస్తాం. కలసిమెలసి ఉండడం ద్వారా ఉండే ప్రయోజనాలను వివరిస్తాం. చాలామంది కౌన్సిలింగ్ అనంతరం ఒక్కటవుతున్నారు.

–జిల్లెల రజని, సోషల్ కౌన్సిలర్.

ఉచిత న్యాయసహాయం అందిస్తాం..



కౌన్సిలింగ్ ద్వారా రాజీపడని వారికి ఉచితంగా న్యాయసహాయం అందేలా చూస్తాం. కోర్టులో కేసు వేసి, వారికి సత్వర న్యాయం దొరికేలా చర్యలు తీసుకుంటాం. కోర్టులో కేసుల తర్వాత కేసుల మధ్యలో కూడా చాలామంది రాజీకి వచ్చి, కలిసిపోతున్నారు.

జి.మాధవి, లీగల్ కౌన్సిలర్.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 బాల,బాలికల కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ శనివారం పూర్తయింది. నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు విజయనగరం, పార్వతీపురం మన్యం జి ల్లాల నుంచి 350 మంది హాజరయ్యారు. ఆద్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఎంపిక పోటీల్లో జిల్లా జట్టులో స్థానం దక్కించుకునేందుకు బాలబాలికలు పోటీపడ్డారు. మొత్తం 12 మంది బాలికలు, 12 మంది బాలురు జిల్లా జట్టుకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులంతా ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఏలూరులో జరిగే అంతర్‌జిల్లాల బాల,బాలికల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారని జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.వి.ఎల్.ఎన్ కృష్ణ తెలిపారు.

9న బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక..

జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాల,బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పి.వి.ఎల్.ఎన్.కృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించే ఎంపిక పోటీల్లో ఇంటర్ విద్యనభ్యసిస్తూ 19 ఏళ్లలోపు బాల,బాలికలు హాజరుకావాలన్నారు.

పార్వతీపురంటౌన్: స్థానిక పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 160 మంది బాలబాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ కార్యదర్శి డి.టి.గాంధీ పాల్గొన్నారు.

వేర్వేరు దుర్ఘటనల్లో ఐదుగురి మృతి

వేర్వేరు దుర్ఘటనల్లో వివిధ కారణాలతో పలువురు మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి..


రైల్వేట్రాక్ పక్కన తేజేశ్వరరావు మృతదేహం (ఇన్‌సెట్‌లో) తేజేశ్వరరావు (ఫైల్)

ఖమ్మంలో బత్తిలి వాసి..

భామిని: తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో భామిని మండలంలోని బత్తిలి గ్రామానికి చెందిన బట్టల వ్యాపారి మగదాల తేజేశ్వరరావు(37) మృతి చెందిన విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భార్యతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి, ఈ నెల 4వ తేదీన హైదరాబాద్ నుంచి ఇంటికి రైలులో వస్తున్న ఆయన అకస్మాత్తుగా మాయమయ్యాడు. మరుసటిరోజు ఖమ్మం సమీపంలోని నాగిరెడ్డి పాలెం రైల్వేట్రాక్ వద్ద అతడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. ఇదే ఏడాది సెప్టెంబరు 1వ తేదీన తేజేశ్వరరావు పాలకొండ సమీపంలోని వాటపాగు గ్రామానికి చెందిన వరలక్ష్మిని రెండో వివాహం చేసుకున్నారు. ఆమెతో కలిసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి, వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో తేజేశ్వరరావు మృతిపై ఆయన తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తేజేశ్వరరావు మొదటి భార్య బంధువులే ఆయనను కిడ్నాప్ చేసి, హత్య చేసి ఉంటారని ఆరోపిస్తూ ఖమ్మం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మొదటి భార్యకు విడాకులు ఇచ్చిన తర్వాతనే తమ కొడుకు రెండో పెళ్లి చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టరు బోల్తాపడి వ్యక్తి..


బోల్తాపడిన ట్రాక్టరు కింద మృతి చెందిన వెంకటనారాయణ

వీరఘట్టం... గరుగుబిల్లిరూరల్(గరివిడి): ట్రాక్టరు బోల్తాపడి గరివిడి మండలం, గొట్నంది గ్రామానికి చెందిన సారధి వెంకటనారాయణ(55)అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. శనివారం ఉదయం తన సొంత ట్రాక్టరుపై మొక్కజొన్న తీసుకు వచ్చేందుకు సిరిదేవిపురం వెళ్తుండగా, కొయ్యప్పయ్య మామిడితోట దగ్గర రోడ్డుపై ఆరబెట్టిన జొన్నలను తప్పించేక్రమంలో అదుపు తప్పి, పక్కనే ఉన్న గెడ్డలో ట్రాక్టరు బోల్తాపడింది. ట్రాక్టరు కింద వెంకటనారాయణ ఇరుక్కుని తీవ్రగాయాలపాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య కసిరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎల్.దామోదరరావు తెలిపారు.

పాముకాటుతో..


విజయనగరం రూరల్: తంగేటి కృష్ణ(ఫైల్)

విజయనగరం రూరల్: పాముకాటుతో తంగేటి కృష్ణ(55)మృతిచెందిన విషాద ఘటన విజయనగరం మండలంలోని కోరుకొండ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వేకువజామున వరిచేనుకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లిన అతడిని పాము కాటువేసింది. ఈ విషయం గమనించిన అతడు గ్రామంలోకి వచ్చిన కొద్ది సమయానికే ప్రాణాలు విడిచినట్లు గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని..


పార్వతీపురం టౌన్/కురుపాం: మృతుడు నారాయణరావు

పార్వతీపురంటౌన్/కురుపాం: స్కూటీతో ఆగి ఉన్న వ్యక్తిని లారీ ఢీకొన్న దుర్ఘటనలో కొచ్చర్ల నారాయణరావు(46) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాద ఘటన కురుపాం మండల కేంద్రంలో శనివారం జరిగింది. జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మెయిన్ రోడ్డు పక్కన నారాయణరావు తన స్కూటీని ఆపి, దానిపై కూర్చొన్నాడు. అదే సమయంలో పార్వతీపురం నుంచి వస్తున్న లారీ స్కూటీని బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన నారాయణరావును అటువైపుగా వెళ్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి మంతెన వినోద్‌కుమార్ ఆగి, క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా, మార్గమధ్యలో చనిపోయాడు.

యువతి ఆత్మహత్య..


భామిని: ఆస్పత్రిలో అశ్విని మృతదేహం పరిశీలిస్తున్న పోలీసులు

భామిని: మండలంలోని చిన్నదిమిలి గ్రామంలో ముంచేటి అశ్విని(20) అనే యువతి ఉరి వేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తల్లిదండ్రులు ముంజేటి తిరుపతి, పద్మ కలిసి, అశ్వినిని పెళ్లి చేసుకోమని, అడిగారు. ఏడాది క్రితం పెళ్లి సంబంధం కూడా కుదిర్చారు. పెళ్లి ఇష్టం లేకనే యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బత్తిలి ఎస్‌ఐ వై.అమ్మానరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేటినుంచి అండర్-19 క్రికెట్ టోర్నీ

- అంపైర్లు, స్కోరర్ల భవనాన్ని ప్రారంభించిన ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్ గోపీనాథ్‌రెడ్డి


విజ్జీ స్టేడియంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

విజయనగరం రూరల్: నగరంలో బీసీసీఐ(భారత క్రికెట్ నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో జరిగే అండర్-19 మహిళల వన్డే క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక విజ్జీ స్టేడియంలో అంపైర్లు, స్కోరర్ల కోసం మైదానంలో కొత్తగా నిర్మించిన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆధునికీకరించిన డైనింగ్, డ్రెస్సింగ్ రూమ్‌లు, ఇతర సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మైదానాన్ని చూసి, క్రీడాకారిణులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, టోర్నమెంట్ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎల్.ఎన్ రాజుకు సూచించారు. ఈ-గ్రూప్‌లో ఉన్న బరోడా, మధ్యప్రదేశ్, కేరళ, మిజోరం, అస్సాం, బీహార్ రాష్ట్రాల జట్లు ఈ టోర్నీలో పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా పరిధిలోని విజ్జీ స్టేడియం, నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానం, కందుకూరి క్రికెట్ మైదానంలో ఈ వన్డే లీగ్ మ్యాచ్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ జి.వి.సన్యాసిరాజు, కన్వీనర్ పి.దేవవర్మ, జిల్లా సెలక్టర్ పి.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల షెడ్యూల్..

తేదీ	మ్యాచ్	వేదిక
8.10.2023	బరోడా-మధ్యప్రదేశ్	ఎన్‌సీఏ స్టేడియం
8.10.2023	కేరళ-మిజోరం	కందుకూరి స్టేడియం
8.10.2023	అస్సాం-బీహార్	విజ్జీ స్టేడియం
10.10.2023	బీహార్-మధ్యప్రదేశ్	ఎన్‌సీఏ స్టేడియం
10.10.2023	బరోడా-కేరళ	విజ్జీ స్టేడియం
10.10.2023	అస్సాం-మిజోరం	కందుకూరి స్టేడియం
12.10.2023	కేరళ-మధ్యప్రదేశ్	కందుకూరి స్టేడియం
12.10.2023	అస్సాం-బరోడా	విజ్జీ స్టేడియం
12.10.2023	బీహార్-మిజోరం	ఎన్‌సీఏ స్టేడియం
14.10.2023	అస్సాం-మధ్యప్రదేశ్	కందుకూరి స్టేడియం
14.10.2023	బరోడా-మిజోరం	ఎన్‌సీఏ స్టేడియం
14.10.2023	బీహార్-కేరళ	విజ్జీ స్టేడియం
16.10.2023	మిజోరం-మధ్యప్రదేశ్	విజ్జీ స్టేడియం
16.10.2023	బీహార్-బరోడా	కందుకూరి స్టేడియం
16.10.2023	అస్సాం-కేరళ	ఎన్‌సీఏ స్టేడియం

ఒత్తిడి లేని జీవితం గడపాలి

- ఎస్పీ దీపికా పాటిల్


ర్యాలీలో ఎస్పీ దీపికా పాటిల్ తదితరులు

విజయనగరం ఫోర్ట్: ఒత్తిడి లేని ప్రశాంతమైన జీవితం గడిపేందుకు అందరూ ప్రయత్నించాలని ఎస్పీ దీపికా పాటిల్ సూచించారు. జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా స్థానిక జేఎన్‌టీయూ జంక్షన్ నుంచి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు శనివారం నిర్వహించిన ర్యాలీని ఎస్పీ ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. ప్రతిఒక్కరూ శారీరకంగానూ మానసికంగానూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. నిద్రలేమి, ఒత్తిడి కారణంగా మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎవరైనా మానసిక సమస్యతో బాధపడితే ఆ సమస్యను ప్రాథమిక దశలోనే చికిత్స ద్వారా అధిగమించాలన్నారు. అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో మానసిక ఒత్తిడి నుంచి బయటపడే మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల, వైస్ ప్రిన్సిపాల్ సునీత, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలాసునందని పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్యసేవలు


జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహణపై సూచనలు చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- మంత్రి బొత్స సత్యనారాయణ

మెంటాడ(గజపతినగరం రూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజల వద్దకే వైద్యసేవలు తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని పురిటిపెంట గ్రామసచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆయన రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి, అక్కడ వారికి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఆయన రోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇప్పటికే గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యారోగ్య సిబ్బందిని పంపించి, వైద్యసేవలందిస్తున్నారన్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట గ్రామాల్లోనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తూ అవసరమైన వారికి మందులు అందిస్తున్నారన్నారు. అలాగే చికిత్స అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం అందేలా చేయడం జరుగుతోందన్నారు. ప్రపంచంలో అమెరికా దేశం తర్వాత మన రాష్ట్రంలో మాత్రమే ఇంటింటికీ వైద్యం అందించే వినూత్న కార్యక్రమం జరుగుతోందన్నారు. శిబిరానికి వచ్చే రోగులను బాగా చూసుకోవాలని, వారికి కావాల్సిన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఇదిలా ఉండగా, వైద్యశిబిరం నిర్వహణలో లోపాలుండడంపై మంత్రి మండిపడ్డారు. జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులు రోగులకు పంపిణీ చేయకపోవడంపై తహసీల్దారు అరుణకుమారిని నిలదీశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. మరోసారి ఇటువంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని, లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, జెడ్పీటీసీ జి.తవుడు, మండల ప్రత్యేకాధికారి రమేష్, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీలు కళావతి, రాగలత, కార్యదర్శి జనార్దన్, వైద్యులు సాయికృష్ణ, తనూజరాయ్, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.